



రోడ్డుపై పోసిన ధాన్యం రాశులు

కొనుగోళ్లు.. కష్టం

- సాఫ్ట్‌వేర్ లోపంతో జాప్యం
- ధాన్యం అమ్ముకోవడంలో అన్నదాతల ఇక్కట్లు
- రైతులను భయపెడుతున్న వాతావరణ హెచ్చరికలు
- దళారులను ఆశ్రయించి బస్తాకు రూ.377 నష్టపోతున్న వైనం


(బాపట్ల, కొల్లూరు - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు వాతావరణశాఖ తుపాన్ హెచ్చరికలు.. దక్షిణంత చాలు అని నూర్పిళ్లు చేసుకుని అమ్ముకునేందుకు రైతులు ఆత్రుత పడుతున్నారు. అయితే అధికారుల అలసత్వం అన్నదాతలకు శాపంగా మారింది. జిల్లాలోని 117 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించినట్లు అధికారుల ప్రకటించి వారం దాటింది. రేపల్లె, వేమూరు మండలాల పరిధిలో నూర్పిళ్లు జరిగి ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌లో సమస్య తలెత్తడంతో ఈ-పంట వివరాలు కనిపించకపోవడంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలేదు. సాంకేతిక సమస్యల గురించి ఉన్నతాధికారులకు వ్యవసాయ శాఖాధికారులు వివరించినప్పటికీ సాఫ్ట్‌వేర్ లోపం సరిదిద్దడంలో జాప్యం జరుగుతోంది. మరోవైపు వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇదేఅదనుగా దళారులు రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచేయడానికి తెరతీశారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని పాలకులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దాదాపు నెల రోజుల ముందు నుంచే యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాన్ దోబూచులాడుతుండడంతో నూర్పిడి అయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఇలా ఉంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది అలసత్వం వీడటంలేదు. ఈ-పంట నమోదును ఈ దఫా పక్కాగా నమోదు చేశామని వ్యవసాయశాఖ ఘనంగా ప్రకటించింది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అనేక సాంకేతిక అంశాలు రైతులకు శాపంగా మారాయి. ధాన్యం సేకరణలో సదరు రైతు ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే ఈ-క్రాప్ డిస్‌ప్లేతో స్లాట్ బుక్ అవుతుంది. కానీ చాలామంది రైతులకు ఈ-క్రాప్ అయినట్లు చూపించడంలేదు. చెరుకుపల్లి, కొల్లూరు మండలాల పరిధిలోని పలువురు రైతులకు ఆర్‌ఎస్‌కేల వద్ద సోమవారం ఈ-క్రాప్‌కు సంబంధించిన ప్రతిబంధకం ఎదురైంది. గన్నీ సంచులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని అన్నదాతలకు పంపిణీ చేయడంలో యంత్రాంగం అలసత్వం మూలంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతులు గన్నీ సంచుల కొరకు సిబ్బందిని సంప్రదించగా, తాము మీటింగ్‌లలో బిజీగా ఉన్నామని, మరుసటి రోజు గన్నీ సంచులు ఇస్తామనే సమాధానం రావడం రైతులను విస్మయపరిచేదిలా ఉంది. ధాన్యం నూర్పిడులు చేసి కల్లాల్లో ఉండగా, వర్షపు హెచ్చరికలు భయపెడుతుంటే యంత్రాంగం ఇంత ఉదాసీనంగా సమాధానం ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చే ప్రక్రియ కూడా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీంతో ధాన్యం కొనుగోళ్ల కష్టంగా మారాయి. టార్పాలిన్ పట్టాల కోసం రైతులు ఎదురు చూస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. సివిల్ సప్లయిస్‌తో పాటు వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో ఆరంభంలోనే కొనుగోళ్ల గాడి తప్పుతున్నట్లు అర్థమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 117 కేంద్రాల్లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో ప్రథమంగా కొల్లూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ధాన్యం సేకరణకు సంబంధించి ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్లు సైతం మూగబోయినట్లు రైతులు చెబుతున్నారు. ఒక వేళ ఫోన్ కలిసినా దాదాపు అరంగట పాటు లైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉందని అన్నదాతలు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సివిల్ సప్లయిస్ విభాగం అధికారుల వివరణ కోసం ప్రయత్నించినా వారి ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్‌లో ఉండడం గమనార్హం. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు పొలాల్లో యంత్రాల ద్వారా కోత కోయగా వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకుని తేమ శాతం తగ్గించే ప్రయత్నాల్లో ఉన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి తేమశాతం పరీక్షించుకుని స్లాట్ నమోదు చేయాలని కోరుతుండగా సిబ్బంది మాత్రం సమయం పడుతుందని రైతులకు చెప్తున్నారు. కొనుగోళ్ల జాప్యం కావడం, మరోవైపు వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు గందరగోళానికి లోనై వచ్చిన కాడికి ధాన్యాన్ని అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో దళారులు 75 కేజీల ధాన్యం బస్తా రూ.1350 నుంచి రూ.1400 తేమశాతం, నాణ్యతను బట్టి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బస్తాకు సుమారు రూ.377 నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మ్యుటేషన్ల ప్రక్రియ మారింది

- ఆర్‌డీవో స్థాయిలోనే తుది నిర్ణయం
- ఇకపై జేసీ వద్దకు ఫైలు వెళ్లాల్సిన పని లేదు
- ప్రభుత్వ నిర్ణయంతో భూ యజమానులకు తప్పిన తిప్పలు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూము ల మ్యుటేషన్లకు నూతన కార్య ప్రక్రియని రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం విడుదల చేసింది. వెబ్‌ల్యాండ్‌లోని కొన్ని సర్వే నంబర్లలో పట్టాదారు పేర్లను ఇతరులు/మిగులు భూములు /క్లెయిమ్ చేయని భూమిగా పేర్కొంటూ ఎంట్రీలు చేశారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వెబ్ ల్యాండ్‌లో సవరణలు



చేయించుకోలేకపోయారు. ఎప్పు డైతే భూములను విక్రయించడానికి వస్తారో అప్పుడు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. దీనిని సరి చేసుకోవడానికి గ్రామ/వార్డు సచివా లయం మొదలుకుని జాయింట్ కలెక్టర్ స్థాయి వరకు అర్జీ వెళ్లాలి. చివరికి జాయింట్ కలెక్టర్ దానిని పరిశీలించి ఆమోదం తెలి పాక అప్పు డు తహసీల్దార్ లాగిన్‌లో నుంచి వెబ్ ల్యాండ్‌లో కరెక్షన్ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు వేర్వేరు పనుల్లో బిజీగా ఉంటుండటంతో వీటిని చాలా సందర్భాల్లో పట్టించుకోవడం లేదు. దీని వలన నెలల తరబడి జాప్యం జరుగుతున్నది.

వెబ్‌ల్యాండ్‌లో ఇతరములు అని ఉన్న ఒక సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ నంబర్లు ఉండటాన్ని రైతు క్లెయిమ్ చేయకపోయినా ఉండాలి/ పట్టాదారు డిని గుర్తించకపోయినా ఉండాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వీటి పరిష్కారానికి గ్రామ/వార్డు సచి వాలయంలో అర్జీ పెట్టిస్తున్నారు. అది తహసీల్దార్ లాగిన్‌కి వస్తుంది. ఇలాంటి అర్జీలను పరిశీలించి రీ మార్కులు పొందుపరచాల్సిందిగా వీఆర్‌వోకి తహసీల్దా రు పంపుతున్నారు. ఆ తర్వాత ఆర్‌ఐ పరిశీలన చేస్తున్నారు. అక్కడి నుంచి తిరిగి తహసీల్దార్‌కు వస్తుంది. అనంతరం ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు ఫైలు వెళుతుంది. జేసీ ఆమోదంతో వెబ్‌ల్యాండ్ ఎంట్రీ లలో కరెక్షన్లు చేస్తున్నారు. ఇక నుంచి ఈ ప్రక్రియ ఆర్‌డీవో స్థాయిలోనే జరుగుతుంది. దరఖాస్తు దారుడు జీఎస్‌డబ్ల్యూఎస్(సచివాలయం)లో మ్యుటేష న్ ఫర్ ట్రాన్సాక్షన్ సర్వీసు కింద అర్జీ పెడతారు. దీనిని వీఆర్ వోకి సమాచారం ఇస్తారు. ఆ అర్జీని, డాక్యు మెంట్లను వీఆర్‌వో పరిశీ లించి తహసీల్దార్‌కు పంపుతారు. దీని ఆధారంగా తహసీల్దార్ ఫారం- 8 నోటీసుని రూపొందించి తిరిగి వీఆర్‌వో లాగిన్‌కి పంపుతారు. వీఆర్‌వో ఆ తర్వాత ఎంక్వయిరీ రిపోర్టు, సంబంధిత ఆర్‌వోఆర్ డాక్యుమెంట్స్, ఫారం-8, రిజిష్టర్డ్ డాక్యుమెంట్‌లు, పాత అడంగల్స్, ఎంజాయిమెంట్ సర్వే రిపోర్టు, వాటర్ ట్యాక్స్ పేమెంట్ రశీదు, పక్క భూముల రైతుల ఎంజాయిమెంట్ స్టేట్‌మెంట్‌ని సేకరించి అన్ని పరిశీలన చేసి ఆర్‌ఐకి పంపుతారు. ఆర్‌ఐ చెక్‌లిస్టు ప్రకారం అన్ని ఉన్నాయా, లేదా అని పరిశీలించి తహసీల్దార్‌కు రీమార్కులు రాసి నివేది స్తారు. తహసీల్దారు వీఆర్‌వో, ఆర్‌ఐ రీమార్కులు, డాక్యుమెంట్లను పరిశీలించి సబ్ కలెక్టర్ /ఆర్‌డీవో లాగిన్‌కు పంపుతారు. ఆర్‌డీవో తన వద్దకు వచ్చిన వీఆర్‌వో, ఆర్‌ఐ చెక్‌లిస్టులు, డాక్యుమెంట్‌లు, తహసీల్దార్ సిఫార్సులను పరిశీలించి వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్స్‌కి అనుమతిస్తూ తిరిగి తహసీల్దార్‌కు పంపి స్తారు. దీంతో జాయింట్ కలెక్టర్లపై పనిభారం తగ్గడం తో పాటు అర్జీలు కూడా త్వరితగతిన పరిష్కార మౌతాయని భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి స్పష్టం చేశారు.

పదోన్నతుల పండుగ

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు



- డిప్యూటీ ఎంపీడీవోలుగా 86 మందికి అవకాశం
- స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు కేటాయింపు

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

పంచాయతీల పాలనలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. పల్లె వాసులకు మేరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ల స్థానంలో పంచాయతీలకు గ్రేడ్‌లను అమలులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో కార్యదర్శులు.. సిబ్బంది క్యాడర్‌లో మార్పులు చేసింది. కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికా రులుగా మార్పు చేసింది. ఆదాయం.. జనాభా ఆధారంగా పంచాయతీలకు కేటాయించిన గ్రేడ్‌ల ప్రకారం అధికార సిబ్బందిని కేటాయిస్తోంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటి ఎంపీడీవోలను నియమించనుంది. కార్యదర్శులకే డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రమోషన్ పొందిన కార్యదర్శుల జాబితాను పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 86 మంది కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించాయి.

గ్రేడ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే..

గుంటూరు జిల్లాలో అత్యధికంగా కార్యదర్శులకు డీప్యూటీ ఎంపీడీవోల పదోన్నతులు కల్పించారు. 43 మంది కార్యదర్శులకు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. వీరిలో కొందరిని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నియమించారు. బాపట్ల జిల్లాలో 30 మంది, పల్నాడు జిల్లాలో 13 మంది కార్య దర్శులు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పంచాయతీల్లో గ్రేడ్‌ల పాలన అమల్లోకి వచ్చిన వెంటనే పదోన్నతులు పొందిన వారిని పంచాయతీలకు నియమించనున్నారు. పంచాయతీల్లోని జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లలో కొందరిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేశారు. సచివాలయాల్లోని డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గ్రామ ప్రణాళిక సహాయకులుగా నియమించనున్నారు. పంచాయతీల్లో ఐటీ విభాగం ఏర్పాటు చేసి రికార్డుల డిజిటలైజేషన్ చేసే దిశగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద పంచాయతీల్లో పాలనా మార్పులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

రైతును రాజును చేయడమే లక్ష్యం : ఆనందబాబు


రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే ముఖ్య మంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా పనిచేస్తున్నట్లు ఎమ్మె ల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండలంలోని కూచిపూడిలో సోమవారం జరిగిన రైతన్నా మీ కోసం.. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు కరప త్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది పంటలు దెబ్బతింటే రికార్డుస్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించామన్నారు. విచ్చలవిడిగా ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. అన్ని అంశాల్లో రైతులకు అండగా ఉంటా మన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, యలవర్తి బ్రహ్మానందం, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, తుమ్మల కిషోర్, యలమంచిలి బాజీ, కమలాకర్, వెంకటేష్, ఎం ఆనంద్, నాగరాజు, కృష్ణమూర్తి, జగదీష్, యలవర్తి రఘుబాబు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకూడదు

- అమృతలూరు ఆర్‌ఎస్‌కే-2 సందర్శనలో కలెక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జిల్లాలో ధాన్యం సేకరణ జరగాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం-2ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌కే ద్వారా కొనుగోళ్లను పరిశీలించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు పక్రియ చేయాలన్నారు. 7337359375 అనే నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే స్లాట్ బుక్ అవుతుందన్నారు. బ్యాంకు గ్యారెంటీ చెల్లించకపోవడంతో మిల్లర్లతో మాట్లాడారు. 24 గంటల్లోగా బ్యాంకు గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించారు. అనంతరం క్షేత్రస్థాయిలో దిగుబడులను పరిశీలించారు. రైతు వెంకటేశ్వరరావుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, పౌరసరఫరాల డీఎం శివపార్వతి, తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, వ్యవసాయశాఖ ఏడీఏ ధనరాజ్, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, అమృతలూరు పీఏసీఎస్ చైర్మన్ కొత్తపల్లి రవీంద్రబాబు ఎంపీడీవో మారుతీశేషమాంబ, ఏవో భరత్‌కుమార్, ఏఈవో మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌ఎస్‌కే కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

యూరియా దుకాణాలపై దాడులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తా.. రూ.500 అంటూ ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు దుకాణాలపై అధికారులు దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. వీఆర్వోలతో కూడిన బృందాలు ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించాయి. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల్లోనే యూరియా విక్రయాలు జరపాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్లు

నాగులపాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామాల్లో కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని నాగులపాడు గ్రామంలో సోమవారం మంత్రి పర్యటించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు రాకుండా కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 1900 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. నాగులపాడు ఎస్సీ కాలనీలో రూ.40లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందిన గ్రామానికి చెందిన కొప్పుల కోటయ్య, జ్యోతి సుబ్బులు, మాజీ ఎంపీటీసీ పచ్చా సింగయ్య, మంగమూరి బ్రహ్మయ్య, మంగమూరి అరుణ, వేమూరి వసంతరావు తల్లి తదితరులను మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, వ్యవసాయమిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, టీడీపీ నాయకులు కరి పరమేష్, పెంట్యాల రామాంజనేయులు, టీడీపీ మండల, పట్టణ, గ్రామ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజు, రామారావు, స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, సింగరకొండ దేవస్థానం చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో వరూధిని పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

‘చలపతి ఫార్మసీ’లో ఉద్యోగ మేళా రేపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

లాం(తాడికొండ) నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 26న బుధవారం ఫైకేర్ సర్వీసెస్ హెల్త్‌కేర్ సంస్థ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైకేర్ సర్వీసెస్ సంస్థలో మెడికల్ కోడింగ్, బిల్లింగ్, హెల్త్‌కేర్ అకౌంటింగ్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్, మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మసీ, నర్సింగ్, బీపీటీ, బి.హెచ్.ఎం.ఎస్ బి.ఎ.ఎం.ఎస్, ఎం.పి.టి విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూనియర్ ప్రాసెస్ అసోసియేట్ అకౌంట్స్‌కు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేషన్‌తో పాటు.. హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా ఉండాలన్నారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెడికల్ బిల్లింగ్‌కు ఆర్ట్స్ కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేట్లు, హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతాయని, పూర్తి సమాచారం కోరకు 81062 53172, 97407 55323 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నాగార్జున సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 583.20 అడుగులు ఉంది. ఇది 292.24 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 4,034, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 15,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 15,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 5,668 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 3,600, లీకుల ద్వారా 400, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

ఘనంగా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో డిఎస్‌డివో అఫ్రోజ్ ఖాన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు


పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

ఏఎన్‌యూ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో జరుగుతున్న ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ ప్రారంభించి, ప్రసంగించారు. క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటువంటి లీగ్‌లతో బాలికలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మంగళగిరి ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని ఇస్తాయన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదు మాట్లాడుతూ అండర్ 14, 16 బాలికల పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుడు కె.కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ జి.శేషయ్య, కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వర్లు కె.రవి, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చిరుమామిళ్ల


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుబాబు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన చిరుమామిళ్ల మధుబాబు సోమవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి మధుబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఉన్నం లక్ష్మీనారాయణ, కర్నా అమర సైదారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైకుంఠపురంలో ఎమ్మెల్యే ప్రవీణ్‌కు వినతుల వెల్లువ


అదనపు తరగతి గదుల కోసం వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


విద్యార్థులతో మమేకమై..

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన.. వంద రోజులు వంద గ్రామాల పర్యటన రెండవ రోజు సోమవారం మండల పరిధిలోని వైకుంఠ పురంలో విజయవంతంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రవీణ్ ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. రోడ్డు ఆక్రమించారని, విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, కరకట్ట పటిష్టం చేయాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని ఇలా.. ప్రజల నుంచి 35 అర్జీలు వచ్చాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ, జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి సౌకర్యాలను తెలుసుకున్నారు. హైస్కూల్ విద్యార్థులతో మమేకమై వేమన శతకం పద్యాల అర్థాలను అడుగుతూ వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ పార్వతి, ఏఓ అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈ కిరణ్, ఎంఈఓలు ప్రసాద్, శివబాబు, పెదమద్దూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ భావన సూర్యనారాయణ, సర్పంచ్ విఠల్‌రావు, ఎంపీటీసీ కె.రాజు, బి.నాగేశ్వరరావు, శేషుబాబు, బి.రవి టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజా, బీజేపీ నాయకులు ఎ.సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

డీఎస్పీల జంటకు.. శుభాకాంక్షలు



డీఎస్పీలు జగదీష్, విద్యాశ్రీ వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. వీరి వివాహ రిసెప్షన్ సోమవారం రాత్రి గురజాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ బి.కృష్ణారావు హాజరయ్యి.. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ సూరజ్, డీఆర్వో మురళి, విద్యుత్తు శాఖ ఎస్ఈ పి.విజయకుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ, పలువురు జిల్లా అధికారులు, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు. - పిడుగురాళ్ల

రైతులకు నాణ్యమైన విత్తనాలు

● సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ


వరి పంటను పరిశీలిస్తున్న చైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని జడవల్లి, బాపట్ల జిల్లాలోని సంగుపాలెం కోడూరు గ్రామాల మధ్య సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా సాగైనా వరి పంటను సోమవారం చైర్మన్ నరేంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం అర్జున్ ఎస్ఎస్ ఆర్ ఫోర్ వరి రైతులకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా ఉందన్నారు. ప్రతికూల వాతావరణం తట్టుకొని మేలైన దిగుబడులు ఇచ్చే విత్తనాలను సంగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే షుగర్ పేషెంట్లను దృష్టిలో పెట్టుకొని అర్జున్ ఆరోగ్య పేరుతో విత్తనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. పురుగు మందులు తక్కువగా వినియోగించి రైతుకు సాగు వ్యయాన్ని తగ్గించేలా తమ విత్తనోత్పత్తి ప్రాజెక్టు పని చేస్తుందన్నారు. ఎస్ఎస్ఆర్ ఫోర్ అనే విత్తనం గేమ్ చేంజర్ కాబోతుందన్నారు. అలాగే సంగం రుద్రా పేరుతో అధిక దిగుబడులు ఇచ్చే టమాటా విత్తనాలను మార్కెట్లోకి తీసుకొచ్చామని.. ఈ విత్తనాలు రాయలసీమ ప్రాంతంతో పాటు కర్ణాటక లోని రైతులకు మంచి దిగుబడులు ఇస్తున్నాయని చెప్పారు. సంగం వీర పేరుతో మినుము విత్తనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నామన్నారు. డెయిరీ ద్వారా పాడిని లాభసాటిగా చేయడంతో పాటు.. పంటను కూడా లాభసాటిగా తెచ్చేందుకు తమ శాస్త్రవేత్తల బృందం పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ, సీడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నత్తనడకన రహదారి పనులు


రాళ్లు తేలిన రోడ్డు

బాపట్లరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం నాగేంద్రపురం గ్రామం నుంచి ఆసోదివారిపాలెం, మరుప్రోలువారిపాలెం మీదగా కప్పలవారిపాలెం వరకు ఉన్న రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు నెలలు క్రితం పనులు ప్రారంభించి.. రోడ్డు మార్జిన్లు తవ్వి గ్రావెల్ పోశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిలో రాళ్లు పైకి తేలాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల టైర్లు కూడా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. నిలిచిపోయిన పనులను వేగవంతం చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నిరుద్యోగ నిర్మూలనే ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యం

జిల్లా ఉపాధి కల్పన అధికారి రవీంద్ర నాయక్


నియామక పత్రం అందజేస్తున్న రవీంద్ర నాయక్

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ నిర్మూలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రవీంద్ర నాయక్ అన్నారు. సోమవారం సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 138 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 44 మంది వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైనట్లు రవీంద్ర నాయక్ తెలిపారు. అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులతో కలసి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్ కియా ఇండియా కంపెనీల హెచ్‌ఆర్‌లు, కళాశాల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సీబీఎన్ కాలనీలో.. కార్డెన్ సెర్చ్

నరసరావుపేట లీగల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు నర్సారావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డులో గల చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నలుగురు సీఐలు, ఎస్సైలు ఏఎస్‌ఐలు సిబ్బంది మొత్తం వంద మంది పాల్గొన్నారు. సరైన అనుమతి పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. రెండు గంజాయి కేంద్రాలను, ఒక పేకాట స్థావరానికి సంబంధించి సమాచారం లభించింది అన్నారు. పట్టణ సీఐలు ఫిరోజ్, ప్రభాకర్ రావు, వినుకొండ సీఐలు బి.ప్రభాకర్, బ్రహ్మయ్య, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

35,077 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 37,422 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,679 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11500	14000
334	10000	18200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11500	16000	334	10000	17800
273	---	---	నెంబరు. 5	11500	16500
341	10000	17200	341	11500	18000
4884	---	----	4884	---	----
సూపర్ 10	11500	16000	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	15600
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18200
బ్యాడిగి	11000	18000	దేవనూరు డీలక్స్	10500	17200
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8500

ఖాతాలో.. రూ.72 వేల నగదు మాయం

ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన ఘటన సోమవారం వెలుగు చూసింది. మండలంలోని వనికుంట గ్రామానికి చెందిన కనగాని శ్రీను ఈపూరు యూనియన్ బ్యాంకులోని తన బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయలు దాచుకున్నాడు. ఈ నెల 14 నుంచి దశల వారీగా అతని ఖాతా నగదు మాయమైంది. బాధితుడు అన్నదాత సుఖీభవ నగదు ఖాతాలో పడిందో లేదో చూసుకునేందుకు.. సోమవారం యూనియన్ బ్యాంక్‌కు వచ్చాడు. అతని ఖాతాను పరిశీలించిన బ్యాంక్ అధికారులు రూ.36 వేలు నగదు మాత్రమే ఉందని తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన శ్రీను తన ఖాతాలో సుమారు లక్ష రూపాయలు ఉండాలని చెప్పగా.. అధికారులు ఖాతాను క్షుణ్ణంగా పరిశీలించారు. మధ్యప్రదేశ్ నుంచి ఆధార్ కార్డు సాయంతో శ్రీను ఖాతాలోని నగదును డ్రా చేసినట్లు గుర్తించారు. ఇది సైబర్ నేరస్తుల పని అని బ్యాంక్ అధికారులు శ్రీనుకు తెలియజేశారు. కొడుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో.. ఆసుపత్రిలో ఖర్చులకు అప్పులు చేశానని.. తన భూమిని అమ్మి వచ్చిన నగదుతో బాకీల తీర్చానని బాధితుడు తెలిపారు. మిగిలిన లక్ష రూపాయలు బ్యాంకు ఖాతాలో దాచుకుంటే.. దోచుకున్నారంటూ వాపోయాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

నరసరావుపేటలో దారుణ హత్య


మృతుడు షేక్ బాజీ

నరసరావు పేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేశాను పల్లి పంచాయతీ పరిధిలోని ఎల్‌టీ నగర్ వద్ద ఆదివారం రాత్రి దారుణ హత్య జరిగింది. రూరల్ ఎస్‌ఐ కిషోర్ వివరాల మేరకు.. పట్టణంలోని కొండలరావు పేటకు చెందిన షేక్ బాజీ (34)పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాజీని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెనాలి - విజయవాడ మార్గంలో దుగ్గిరాల స్టేషన్ వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. తెనాలి జీఆర్పీ ఎస్‌ఐ వెంకటాద్రి సోమవారం వివరాలు వెల్లడించారు. మూడో నంబరు ట్రాక్‌పై మృతదేహం పడి ఉందన్న సమాచారంతో ఉదయం వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. విచారణలో దుగ్గిరాల పెద అగ్రహారానికి చెందిన దారా సుధీర్‌కుమార్ (42) రైలు ఢీకొని మృతి చెందినట్లు గుర్తించినట్లు చెప్పారు. మృతుడు ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి..

చేబ్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య సోమవారం ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మంచాల గ్రామానికి చెందిన వల్లభదాసు మోహనరావు (58) బుడంపాడు నుంచి చేబ్రోలు వైపు ట్రాక్టరులో ప్రయాణిస్తున్న సమయంలో జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు ఎస్‌ఐ వీరనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తాం

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ● పీజీఆర్ఎస్‌కు 62 అర్జీలు


అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అర్జీదారులకు భరోసా కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 62 మంది అర్జీలు అందజేసి ఎస్పీకి సమస్యలు వివరించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆస్తి తగదాలు, భూవివాదాలు, ఆర్థికలావాదేవీల మోసాలు, ఇతర సమస్యలు ఎస్పీకి అర్జీదారులు వివరించారు. వారి సమస్యలను తెలుసుకొని ఆయా పోలీసు స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి అర్జీలను వేగవంతంగా విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యలు పరిష్కరించటానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిశు మరణాలు తగ్గించేవిధంగా కృషి చేయాలి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరు శిశు మరణాలు తగ్గించే విధంగా కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో సోమవారం శిశు మరణాల మీద సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ గర్భవతిని నమోదు చేసిన దగ్గర నుంచి తప్పక వారికి అవసరమైన అన్ని రకాల పరీక్షలను చేయాలన్నారు. మొదటి నుండే వారు ప్రభుత్వ హాస్పటల్‌లో కాన్పు చేయించుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. కాన్పు చేసిన తర్వాత నవజాత శిశువుపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేయాలని అలాగే పుట్టిన బిడ్డకు చేయవల్సిన వ్యాధి నిరోధక టీకాలు గురించి ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నమన్మోహన్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ లలితా రాజేశ్వరి, డాక్టర్ మౌనిక, సుగుణమ్మ, పరమేశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ

నైతిక విలువలు కలిగిన విద్యార్థులే భవిష్యత్తు నాయకులు

● ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ భాస్కరరావు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో నిలిచే విద్యార్థులే భవిష్యత్తు నాయకులని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీర్ అండ్ టెక్నాలజీ డాక్టర్ డి.భాస్కరరావు అన్నారు. బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో నిర్వహిస్తున్న దీక్షారంభ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డాక్టర్ భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా నైతికవిలువలు, నిజాయితీ, స్వయం క్రమశిక్షణ, మానవతాభావం వంటి గుణాలను అభివృద్ధి చేయాల్సిన సమగ్ర ప్రక్రియ అని చెప్పారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షత వహించగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సౌజన్య, టీచింగ్ అసోసియేట్ డాక్టర్ ఎస్.వినోద్‌కుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ వై.దిలీప్‌సేన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కళాశాల పూర్వవిద్యార్థిని సుచరిత ఆహార సాంకేతిక రంగంలో అపార అవకాశాలు గురించి విద్యార్థులకు వివరించారు.

బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత

కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన క్రియాశీల జన సైనికుడు హుమతిరావు నాగాంజనేయులు ఓ ప్రమాదంలో మరణించాడు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును జనసేన పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు, ఎస్ఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్ తదితర పార్టీ నాయకులు నాగాంజనేయులు కుటుంబానికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకులు విన్నకోట సురేష్, నల్లమోతువారిపాలెం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు గరిగంటి శ్రీనివాసరావు, గుర్రాల వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ప్రమాద చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు, జనసేన పార్టీ నాయకులు

సమగ్రశిక్షలో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి

● జేఏసీ అధ్యక్షుడు గద్దె రమేష్

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షలో పని చేస్తున్న వారి శ్రమ దోపిడికి గురవుతున్నదని వారికి ఉద్యోగభద్రత కల్పించాలని జేఏసీ అధ్యక్షుడు గద్దే రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలో సమగ్రశిక్ష నుంచి పని చేస్తున్న వివిధ విభాగాల వారికి గత 6 సంవత్సరాలుగా జీతాలు పెరగకుండా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనదీక్ష చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జేఏసీ అధ్యక్షుడు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యూటీ, హెల్త్ బెనిఫిట్స్ మెడికల్ లీవ్‌లు, చైల్డ్ కేర్‌లీవ్‌లు అందించాలని, రిటైర్డ్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని యెడల డిసెంబరు 10వ తేదీన ఛలో ఎస్‌పీడీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, సమగ్రశిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపన్ను చెల్లింపుదారులు ఈఫారం రిజిస్ట్రేషన్‌లో నమోదు చేయాలి

● డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనికిరెడ్డి

బాపట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు, వృత్తి పన్ను చెల్లింపుదారులు ప్రతినెల చెల్లించే ప్రొఫెషనల్ పూర్తి వివరాలు (శాలరీ), ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు ఈఫారం రిజిస్ట్రేషన్‌లో నమోదు చేయాలని కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనికిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి వృత్తి పన్ను చెల్లింపుదారుడు నెలనెల చెల్లించే పన్ను వివరాలను అప్‌డేషన్ చేయాలని ఆయన తెలిపారు. వివరాలకు 81060 43007లో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు వర్గీకరించాలి : రవికుమార్

బాపట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లను ఎ, బి, సి, డి లుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను పీజీఆర్ఎస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆదేశాల మేరకు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. 33శాతం చట్టసభలలో, 34శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు అమలు జరపాలన్న ముందుగా కులగణన జరపాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిబోయిన తాతయ్య, శివకుమార్, మారం రవికుమార్, కంకణాల రాంబాబు, ఉప్పాల కృష్ణ, విన్నకోట జగదీష్, అవ్వారు సాంబయ్య, తిరువీదుల కాళీదాసు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
● పీజీఆర్ఎస్‌కు 210 అర్జీలు


కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు అర్జీలు అందజేసి సమస్యలు వివరిస్తున్న బాధితులు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధితాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 210 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖలకు వాటిని పంపించి పరిష్కారం చేయాలని సూచించారు. పరిష్కారం చేయలేని అర్జీలు సంబంధించి ఎందుచేత అర్జీలు పరిష్కారం కాలేదన్న సమాచారాన్ని అర్జీదారులకు ఫోన్ ద్వారా, వాట్సప్ ద్వారా తెలియజేయాలన్నారు. తొలిసారిగా పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు వస్తే అధికారులు స్పందించి అర్జీని పరిష్కరించాలన్నారు. అధికారులంతా మీ పరిధిలోకి వచ్చిన అర్జీని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన మత్స్యకారులు, చేనేతలకు నిత్యావసర సరుకులు, పరిహారం తక్షణమే పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గృహాలు తొలిగించాలనుకోవటం సరికాదు : సీఐటీయూ

అభివృద్ధి పేరుతో నిరుపేదల నివాసాలు తొలిగించాలని నోటీసులివ్వటం సరికాదని సీఐటీయూ నాయకుడు కె.శరత్ అన్నారు. సూర్యలంక సముద్రతీరంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 35 కుటుంబాల వారిని పర్యాటకరంగం అభివృద్ధి పేరుతో ఖాళీ చేయాలని నోటీసులివ్వటం దుర్మార్గమన్నారు. సోమవారం ఈ విషయమై ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు బాధిత మహిళలతో కలిసి వినతిపత్రం అందజేసిన ఆయన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దీనిపై అనేక పర్యాయాలు అధికారులకు వివరించినా మరలా ఖాళీ చేయమని నోటీసులివ్వటం దారుణమన్నారు. వెంటనే దీనిని విరమించుకొని వారు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ, తిరుపతమ్మ, స్వాములు, మహిళలుపాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిరువ్యాపారులపై దౌర్జన్యం చేస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు బాధిత కుటుంబంతో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు. జీబీసీ రోడ్డులో పోస్టాఫీస్ ఎదురు దుకాణం నిర్వహిస్తున్న పసుపులేటి రవికుమార్ కుటుంబంపై ఈనెల 18వ తేదీన మున్సిపల్ సిబ్బంది తనిఖీ పేరుతో వచ్చి దాడి చేసి గాయపరిచారంటూ వారు ఆరోపించారు. రవికుమార్ భార్య శిరీష గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికి పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. కార్యక్రమంలో జైభీమ్‌రావ్, భారత్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్‌రామ్‌జి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పర్రె కోటయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తస్నీరు సింగరకొండ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దోనేపూడి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుభాష్ దినకర్, బాధితుడు పసుపులేటి రవికుమార్ ఉన్నారు.

అర్జీ ఇవ్వటానికి వచ్చి స్పృహ తప్పి పడిపోయిన మహిళ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇవ్వటానికి వచ్చిన మహిళ స్పృహ తప్పి పడిపోయింది. గతంలో పీజీఆర్ఎస్ అర్జీలు కంప్యూటర్‌లో ఎంటర్ చేసి రశీదు ఇచ్చిన తర్వాత కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించేవారు. ప్రస్తుతం కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన తర్వాత రశీదు కోసం కంప్యూటర్ కౌంటర్ దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తున్నది. దీంతో క్యూలో ఉన్న మహిళ ఎక్కువ సేపు నిలబడలేక కుప్పకూలింది. అక్కడ ఉన్న వారు ఆమెకు సపర్యలు చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు


ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఆదర్శవేదిక నాయకులు

రేపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మైనేనివారిపాలేనికి చెందిన నార్ల వెంకటరామారావు మాట్లాడుతూ గ్రామం నాలుగురోడ్ల కూడలి, పెదకాల్వమీద ఉన్న వంతెన పరిసరాలు ఆక్రమణకు గురయ్యాయని, సదరు ఆక్రమణలు తొలగించాల్సిందిగా కోరారు. కారుమూరు గ్రామానికి చెందిన కారుమూరు సుబ్బారావు హరిజన ఫిషరీస్ సొసైటీలో జరిగిన ఎన్నికల అవకతవకలపై విచారణ చేయాలని కోరారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన లోయ వెంకటరాఘవరావు వీధికి జాయింటు గల్లీకలదని గల్లీ ఆక్రమణకు గురైందని, విచారించి ఆక్రమణను తొలగించాలని కోరారు. 4వ వార్డుకు చెందిన మాధవరావు గవర్నమెంట్ పురాతన భవనంలో చెత్తాచెదారాలు నిల్వ ఉన్నాయని, వాటి వలన దుర్వాసన వెదజల్లుతుందని, చెత్తను తొలగించాలని కోరారు. నగరం మండలం చిరకాలవారిపాలేనికి చెందిన కొప్పుల వెంకటేశ్వరరావుకు ఏలేటిపాలెం గ్రామంలో భూమికలదని సదరు భూమిని సర్వేచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ సమస్యలను విచారించి పరిష్కరిస్తామని తెలిపారు.

అమరావతి బుద్ధిస్ట్ అభివృద్ధి సమూహంలో చేర్చాలి

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు బౌద్ధ స్థూపాన్ని అమరావతి బుద్ధిస్ట్ అభివృద్ధి సమూహంలో చేర్చాలని ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి దోవ రమేష్‌రాంజీ వినతి పత్రం అందించారు. సోమవారం బాపట్లలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సొసైటీ సభ్యులు కలెక్టర్ బి.వినోద్‌కుమార్‌కు బౌద్ధస్థూపం అభివృద్ధిపై వినతి పత్రం అందించారు. అనంతరం సొసైటీ కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిలో భాగంగా బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసేందుకు అమరావతి, విశాఖపట్నం కేంద్రాలుగా బుద్ధిస్ట్ సమూహాలను అభివృద్ధితో పాటు ప్రాచుర్యం కల్పించేందుకు కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆ ఉత్తర్వుల్లో భట్టిప్రోలు బౌద్ధ స్థూపాన్ని విస్మరించారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జయప్రదం చేయాలి : చార్వాక

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభ, బహిరంగసభ ఈనెల 26వ తేదీ అంబేద్కర్‌సర్కిల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక తెలిపారు. ఈ విషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ ఆమోద దినోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హెచ్చుతగ్గులు లేని సమాజం రాజ్యాంగం ద్వారా నిర్మించబడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు కాటి విజయ్‌కుమార్, కురగంటి శ్యామ్, తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, డాక్టర్ గుదే రాజారావు, శీలం రోజన్‌బాబు, కొచ్చెర్ల వినయ్‌రాజు, కాగిత కోటేశ్వరరావు, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, టి.యోహాన్ పాల్గొన్నారు.

కొత్తబస్టాండ్ కూడలిలో వాహనాల విస్తృత తనిఖీలు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తబస్టాండ్ కూడలిలో సోమవారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు సీఐ ఆర్.రాంబాబు వాహనాలు తనిఖీ చేసి వాహనపత్రాలను పరిశీలించారు. డ్రైవర్ లైసెన్స్‌లను పరిశీలించి వారికి పలుసూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలకు జరిమాన విధించారు. ఎన్‌డిపిఎస్, గంజాయి వంటివి నియంత్రణకు సంబంధించి కూడా వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు ధ్రువీకరణపత్రాలు ఉండాలి : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తగిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ తెలిపారు. సోమవారం రెడ్డిపాలెం ఎన్‌హెచ్ 216 రహదారిపై ఎస్ఐ శివకుమార్ వాహన చోదకులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు, వెనుక కూర్చొన్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా పలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చందోలు పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రిక్షా కార్మిక కుటుంబానికి బియ్యం అందజేత

కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి మహారాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంలో ఒక రిక్షా కార్మిక కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు మాట్లాడుతూ పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు, దుప్పట్లు, అనారోగ్యం ఉన్నవారికి ఆర్థికచేయూతను సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూనం కృష్ణ, తూనుగుంట్ల రామ్మోహనరావు, మంతెన సతీష్‌కుమార్‌రాజు, పెనుమెత్స భార్గవ, శివరామరాజు, కృష్ణకాంత్, రాజశేఖర్, భాగ్యరాజు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంత్యోత్సవాలు

కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శత జయంత్యోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, జెండా ఆవిష్కరణ, రథోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకలలో తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, 350 మంది నారాయణ సేన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు : వైసీపీ

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం 3వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కోటిసంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కె.శేషగిరి, చిత్రాల ఓబేదు, టి.శ్రీనివాసరావు, ఎన్.వీరేంద్ర, ఎస్.ప్రభుకిరణ్, ఎన్.నాంచారయ్య, వి.నాగలక్ష్మి, ఆనంద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖరీఫ్ రైతులకు అనుగుణంగా 8 కస్టర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో మహేష్‌బాబు అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల వ్యవసాయశాఖాధికారి, తహసీల్దార్‌లు ఇంటింటికి వెళ్ళి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వారం రోజులపాటు ఇంటింటికి వ్యవసాయ అనుబంధ శాఖలు వెళ్ళి మూడుసీజన్‌లో అభివృద్ధి, పంచసూత్రాల గురించి వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శివకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29 వరకు మీకోసం రైతన్న వారోత్సవాలు

కర్లపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో రైతన్న మీకోసం వారోత్సవాలు ఈనెల 29వ తేదీ వరకు జరుగుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. సోమవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ, ఇన్‌చార్జి డీపీఎం హుస్సేన్ నల్లమోతువారిపాలెంలో పాల్గొని పీఎండీఎస్ కిట్ల వల్ల వచ్చే ఉపయోగాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కొల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మట్టిఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేతేపల్లి షాలేంరాజు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని జువ్వలపాలెం శివారు కొత్తగూడెం గ్రామానికి చెందిన గొరికపూడి పెదరంగయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలిసిన ఆయన స్పందించి సోమవారం మట్టిఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని తమ ప్రతినిధులతో అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా కోశాధికారి మణిలాల్

రేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా కోశాధికారి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, సీపీఎం, కార్మికుల ఆధ్వర్యంలో కేంద్రం ఇచ్చిన ఆదేశాల లేబర్ కోడ్‌లను బస్టాండ్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారవేత్తలకు, పరిశ్రమ అధిపతులకు కార్మికవర్గాన్ని బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు నష్టం కలిగించిందన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 26న కార్మిక, కర్షక, రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ఎన్‌వీ సాగర్, శివప్రసాద్, కే.ఆశీర్వాదం, యూ.రామకృష్ణ, ప్రసాద్, విజయ్, ఎం.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కె.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పనులకు భూసేకరణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల ప్రాజెక్ట్ పనులకు భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో సంబంధితాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెళ్ళే 554జీ, 167ఎ, 16,544డి ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసేందుకు కావాల్సిన భూసేకరణలో ఉండే కోర్టు సమస్యలు త్వరితగతిన పరిష్కరించి జాతీయరహదారుల పురోగతిని మెరుగు పరిచేవిధంగా అధికారులు పనిచేయాలన్నారు.

● బాపట్లలో రైల్వేట్రాక్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ విషయమై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. భూసేకరణకు రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి నివేదిక అందజేయాలన్నారు. ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అదనంగా 2.53 ఎకరాల భూమి కొరకు ప్రతిపాదన పంపాలని రైల్వే అధికారులకు కలెక్టర్ సూచించారు. చుండూరు మండలం మోదుకూరు, చుండూరు వద్ద లెవెల్‌క్రాసింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. బాపట్లలో రైల్వేస్టేషన్ పరిసరాల అభివృద్ధికి సంబంధించి స్థల సేకరణ విషయంలో పూర్తిగా సహాయసహకారాలు అందిస్తామని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆయన రైల్వే అధికారులకు తెలిపారు.

● జిల్లాలో ప్రవహించే ఈస్ట్ తుంగభద్ర, రొంపేరు రైట్ ఆర్మ్, సాల్ట్ డ్రెయిన్, గుంటూరు ఛానల్, గణపవరంస్వామి డ్రెయిన్, నల్లమడ డ్రెయిన్ ఆధునీకరణ పనులలో సమస్యలను అధిగమించి పనులు వేగవంతం చేయాలని డ్రైనేజి అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాల కేటాయింపునకు స్థల సేకరణలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె మండలాలలో సేవేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాన్ ఏర్పాటుకు స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు పలు మండలాలలో అభివృద్ధి పనులకు సంబంధించి స్థల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులపై తగుచర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ల్యాండ్‌ఎక్విజిషన్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మీ ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, ఆయా మండలాల తహసీల్దార్‌లు, నేషనల్ హైవే, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


వేపాడ చిరంజీవిని కలిసి మాట్లాడుతున్న బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, మహిళా నాయకులు

నాయకులతో సమీక్షించిన టీడీపీ జోన్-3 కోఆర్డినేటర్ చిరంజీవి

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జోన్-3 కోఆర్డినేటర్ వేపాడ చిరంజీవి సోమవారం బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పార్టీశ్రేణులతో సమీక్షించారు. బాపట్ల, చీరాల, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులు ఆయనను కలిసి మాట్లాడారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు ఆయనను కలిసి పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యకర్తలలో ఉన్న అసంతృప్తి గురించి తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు విచ్చేసిన చిరంజీవికి నాయకులు, కార్యకర్తలు పలు విషయాలు తెలియజేశారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు కార్యాలయాలలో అడ్మినిస్ట్రేషన్ సక్రమంగా లేదని పలువురు వివరించారు. ఈ విషయాలను మంత్రి లోకేశ్‌కు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌లను చిరంజీవి కలిసి చర్చించారు. ఆయనను కలిసిన వారిలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యేలు చీరాల గోవర్ధనరెడ్డి, బాచిన చెంచు గరటయ్య, పాలేటి రామారావు, నాయకులు పూర్ణ, మహిళా నాయకులు పల్లం సరోజినీ, చెన్నుపాటి హైమావతి, కె.సుజాత, కాగిత నాగభూషణమ్మ, రమాదేవి, కూచిపూడి ఝాన్సీరాణి, నజ్మా ఉన్నారు.

విశ్రాంత ఎన్‌సీసీ అధికారికి సత్కారం

కొల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఎన్‌సీసీ అధికారిని టీఎంరావు ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఎన్‌సీసీ అధికారి కెవిఎల్ పార్వతి గత 26 సంవత్సరాలుగా ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకుని కరస్పాండెంట్ మర్యాద పూర్వకంగా సోమవారం పాఠశాలకు ఆహ్వానించి ఆమెను సత్కరించారు. ఆదివారం గుంటూరులో గరల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌సీసీ దినోత్సవంలో టీఎంరావు ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న తిరుపతమ్మ, యాసినా ఉత్తమ కాడెట్లుగా ఎంపిక కావడంతో వారిని అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ సుగుణకుమారి, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, రత్న, చెన్న ఉమామహేశ్వరరావు, మురళీధరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంత్రి లోకేశ్ ప్రోత్సాహం

● జీడీసీసీబీ చైర్మన్ మక్కెన



100మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

వినుకొండటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులకు మంత్రి నారా లోకేశ్ ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ప్రారం భమయ్యాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం మక్కెన మాట్లాడుతూ ఇటీవల వినుకొండలో నిర్వహించిన అండర్ -17 బాల బాలికల కబడ్డీ పోటీలు గుర్తింపు తెచ్చాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించారు. క్రీడా ప్రాంగణాలను నూతనంగా తీర్చిదిద్దడంపై క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి షకీలాబేగం, ఫాదర్ అవినాష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు సురేష్, పద్మావతి, పీఈటీలు వై.వి.చిరంజీవి, రాజు, కొండలు, రాజేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

రూ.కోట్లు ఖర్చు.. దాహార్తి తీరిస్తే ఒట్టు!

● పాఠశాలల్లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు
● ఇన్‌స్టలేషన్ చేయలేక మరమ్మతులకు..
● అందుబాటులోకి తెస్తే..విద్యార్థులకు తాగునీరు

గుంటూరు(విద్య) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్కడ పేరుకు మాత్రమే వాటర్ ప్లాంట్లు ఉంటాయి. రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినా అందులో నుంచి చుక్క నీరు రాదు. కేవలం ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లించని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు అలంకార ప్రాయంగా మారిన వైనమిది. గత వైసీపీ పాలనలో నాడు-నేడు పనుల్లో భాగంగా కొనుగోలు చేసిన ఈ ప్లాంట్లు విద్యార్థులకు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయో తెలియక, వాటిని పర్యవేక్షించలేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

ఒక్కో ప్లాంట్ ఖరీదు రూ.లక్షల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశ పనుల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ప్రమేయం లేకుండా ఆరో ప్లాంట్లు కొనుగోలు చేసి ఎన్నికలకు ముందు పాఠశాలలకు తరలించారు. ఒక్కో ప్లాంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 100కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోట్ల వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చిన వెంటనే నిర్దేశించిన ప్రదేశంలో షెడ్డు నిర్మించి.. అక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. అయితే వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చి నెలలు గడిచినా షెడ్లు నిర్మించలేదు. కొన్ని నెలల తర్వాత ఆరో ప్లాంట్ల నిర్వహణపై విమర్శలు రావడంతో షెడ్లు నిర్మించి వాటిని పెట్టారు. అయితే విద్యుత్ సరఫరా ఇచ్చి ఇన్‌స్టలేషన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈలోగా ఎన్నికలు రావడం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అనేక పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు షెడ్లకే పరిమితమయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు 19 నెలలు పూర్తయింది. తాజాగా నాడు నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చారు. గత పాలకులు చేసిన తప్పిదాలను మాత్రం సరి చేయడం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు

దుమ్ముపట్టి.. దిష్టిబొమ్మల్లా..

గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం, ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌తో పాటు 11 మున్సిపల్ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు దుమ్ము పట్టి ఉన్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలోని అనేక జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం వాటర్ ప్లాంట్లు ఉపయోగంలోకి రాక దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు రావడంతో కొన్ని మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల, బ్యాటరీ ఫెయిల్ కావడం, ఫిల్టర్లు పాడైపోవడం, ప్లాంట్‌లో అంతర్గతంగా సాంకేతిక సమస్యలు రావడంతో ఇన్‌స్టలేషన్ చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థలకు ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లిస్తే ఇవి వినియోగంలోకి వస్తాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్న ఆర్ఓ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలని, గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'వేలం'వెర్రిగా నమ్మించి.. రూ.కోటి టోకరా

● సగం ధరకే బంగారం ఇస్తానని మోసం
● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనో బ్యాంకు ఉద్యోగినని చెప్పుకుంది. బ్యాంకు తాకట్టులోని బంగారం వేలంలో తక్కువ ధరకే వస్తుందని నమ్మించింది. ఆ బంగారాన్ని సగం ధరకే ఇస్తానని తన తండ్రితో కలిసి కోట్ల రూపాయలు వసూలు చేసి.. అటు బంగారం ఇవ్వక.. ఇటు డబ్బులు తిరిగివ్వక మోసం చేసిందని.. ప్రశ్నిస్తే.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు పెడతానని బెదిరిస్తోందని బాధితులు ఎస్పీ కార్యాలయానికి సోమవారం క్యూకట్టారు. బాధితుల్లో పెదకాకానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ కూడా ఉన్నారు. బాధితురాలు గుల్జార్ ఫిర్యాదు మేరకు.. తమ ఇంటి సమీపంలో నివాసం ఉండే ఓ మహిళ ద్వారా నంబూరుకు చెందిన మహిళ పరిచయమైందని పేర్కొన్నారు. తను విజయవాడ భవానిపురంలోని ఓ బ్యాంకు బ్రాంచీలో ఉద్యోగం చేస్తుంటానని చెప్పిందన్నారు. తమకు వేలంలో బంగారం తక్కువ ధరకే వస్తుందని, దానిని సగానికి సగం ధరకే ఇస్తానంటూ నమ్మబలికిందన్నారు. ఆమె మాటలు నమ్మి జనవరిలో రూ.3 లక్షల నగదు ఇవ్వగా.. అందుకు గాను రూ.5 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు ఇచ్చిందన్నారు. దీంతో ఆమె మాటలు నమ్మి ఇంటిని విక్రయించి రూ.20 లక్షలు, బంగారు ఆభరణాలన్నీ అమ్మేసి మరో రూ.20లక్షలు ఇచ్చానని వాపోయారు. దీనికి తోడు ఇంటి పక్కన చుట్టుపక్కల తెలిసిన వారందరితో ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆమెకు కట్టించానన్నారు. అలా చుట్టుపక్కల వారి నుంచి రూ.70 లక్షలు ఇప్పించానని గుల్జారు తెలిపారు. తక్కువ ధరకు బంగారం ఇస్తానన్న మహిళ.. ప్రస్తుతం నంబూరు నుంచి పారిపోయి ఇబ్రహీంపట్నంలో ఉంటోందని చెప్పారు. కొంత మొత్తం నగదు ఆమె తండ్రికి కూడా ఇచ్చామన్నారు. ఆయన ఇబ్రహీంపట్నంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. తాము నగదు కోసం అక్కడికి వెళ్తే.. ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తోందన్నారు. ఇలా నమ్మించి మోసం చేసి.. రూ.1.20 కోట్లు వరకు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గిరిపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిపుత్రుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన యువత ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థానంలో ఉండడం జగన్‌రెడ్డికి ఇష్టం లేక విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి విదేశి విద్యను కొనసాగిస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన రోడ్లు, సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ఆసరాగా 1962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో రోడ్లు వేయిస్తున్నారన్నారు. స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతుల సొమ్ము స్వాహా

● జీడీసీసీ బ్యాంకు శాఖల్లో రూ.కోట్లలో అక్రమాలు ● విచారణ దశలోనే వినుకొండ, గురజాల శాఖల కుంభకోణాలు
● కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ అక్రమాలు ● కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము మేత
● విచారణ పేరుతో సాగదీతపై విమర్శలు



గుంటూరులోని ఎన్టీఆర్ సహకార భవన్

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు శాఖల్లో అక్రమాలు తొవ్వే కొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దళారులు అడ్డగోలుగా కోట్ల రూపాయలు పోగేసుకు న్నారు. కొన్ని ప్లెడ్జి రుణాలు కాగా మరికొన్ని స్వయం సహాయక సంఘాల పేరుతో నకిలీలు సృష్టించి దండుకొన్నారు. తాజాగా నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు రూ.22 కోట్లుపైనే అక్రమాలు జరిగినట్లు తేల్చారు. దీనిపై ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్‌తో పాటు పలువురు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా పరిణామాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ శాఖల్లో అక్ర మాలు చర్చనీ యాంశంగా మా రాయి. నల్లపాడు శాఖలో కుంభకోణం కంటే ముం దుగానే వినుకొండ, గురజాల శాఖల్లోనూ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పేరుతో నకిలీ గ్రూపులను సృష్టించి రూ. కోట్లలోనే దోచేసిన వైనంపై ఇప్పటికే విచా రణ జరుగుతున్నట్లు తెలిసింది. అయితే నల్లపాడు శాఖలో అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం.. అంతకంటే ముందుగానే వినుకొండ, గురజాల శాఖల్లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ

సెంట్రల్ బ్యాంకుకు చెందిన కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ రూ.కోట్లలోనే అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులోనూ పెద్దఎత్తున నకిలీ గ్రూపులు సృష్టించి రుణాలు పొందినట్లు తెలిసింది. అంతేగాక వినుకొండ, గురజాలతో పాటు పొన్నూరు, ప్రత్తిపాడు, శాఖల్లోనూ అక్రమాలు ఉన్నాయని, విచారణ పేరుతో దీర్ఘకాలంగా సాగదీస్తున్నారే తప్ప చర్యలలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొందని విమర్శలు ఉన్నాయి.

కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము స్వాహా

మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతుల సొమ్మును వారికే తెలియకుండా కొందరు అక్రమార్కులు స్వాహా చేసిన వ్యవహారం ఆ శాఖలో తీవ్ర కలకలం రేకెత్తిస్తోంది. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళగిరి పీఏసీఎస్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే ఏడాది కిందట జరిగిన ఈ అక్రమాలపై విచారణ పేరుతోనే సాగదీస్తున్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులే అక్రమాలలో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళగిరి సొసైటీలో ఇలా ఉంటే కురగల్లు సొసైటీలో కొందరు ఉద్యోగులే నకిలీ పత్రాలు సృష్టించి సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపైనా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇలా వారి వారి స్థాయిల్లో అక్రమార్కులు రైతుల సొమ్ము స్వాహా చేసి దర్జాగా తిరుగుతున్నారు. విచారణల పేరుతో సాగదీస్తుండటంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

● నిందితుల్లో ఒకరు మైనర్

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నల్లపాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు.. నల్లపాడు ఎస్ఐ మహేష్‌కుమార్‌కు అందిన పక్కా సమాచారం మేరకు.. ఆయన తన సిబ్బందితో కలిసి పలకలూరు రోడ్డు నుంచి జన్మభూమి నగర్‌కు వెళ్లే రోడ్డులో తనిఖీ చేశారు. గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకరు పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ ఒకటో లైనుకి చెందిన షేక్ ఖాజావలి కాగా, మరొకరు.. అంకమ్మనగర్ ప్రాంతానికి చెందిన పదహారేళ్ల మైనర్ అని తెలిపారు. వారి నుంచి మూడు కిలోల 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. లంబసింగి ప్రాంతం నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకు వచ్చినట్లు నిందితులు చెప్పారని తెలిపారు. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లలో ఉంచి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులు తమకు తెలిసిన గోపి అనే వ్యక్తికి గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పరారైన గోపీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

హేమతో ప్రేమ.. పెళ్లి



బాలీవుడ్‌లోని ఐకానిక్ ప్రేమ జంటల్లో ఒకటిగా ధర్మేంద్ర, హేమమాలిని గుర్తింపు తెచ్చుకున్నారు. 'తూ హసీనా మై జవాన్ తూ' చిత్రంతో రీల్ లైఫ్‌లో మొదలైన వారి అనుబంధం.. రియల్ లైఫ్ వరకూ సాగింది.. మరోవైపు నటులు సంజీవ్ కుమార్, జితేంద్ర హేమమాలిని వెంట పడేవారు. కానీ ఆమె మాత్రం ధర్మేంద్రకే మనసిచ్చారు. 'తూ హసీనా మై జవాన్ తూ' లీడ్ పెయిర్‌గా నటించిన ఈ ఇద్దరూ చిత్రీకరణ పూర్తయ్యే సరికి ప్రేమలో పడ్డారు. 'అయితే ప్రేమలో పడినంత సులభంగా వారి పెళ్లి జరగలేదు. హేమమాలినితో ప్రేమలో పడే సమయానికే ధర్మేంద్రకు ప్రకాశ్‌కౌర్‌తో పెళ్లై నలుగురు సంతానం ఉండేవారు. వారే సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. అలానే అప్పటికే పెళ్లైన వ్యక్తితో జీవితం ఎలా పంచుకుంటావు అని హేమమాలిని తల్లిదండ్రులు ఈ పెళ్లికి ససేమిరా అన్నారు. దాదాపు ఐదేళ్లు ప్రేమించుకున్నాక, వివాహం చేసుకుందాం అనే సమయానికి ప్రకాశ్ కౌర్ విడాకులకు అంగీకరించలేదు. అయినా అన్ని అడ్డంకులు దాటుకుని ప్రేమించుకున్న ఏడేళ్లకు వారు ఏడడుగులు వేశారు. పెళ్లయ్యాక వారికి ఇద్దరు కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ జన్మించారు. వారి వివాహ సమయంలోనూ పలు రూమర్స్ రావడం గమనార్హం. వారి పెళ్లికి హిందూ వివాహ చట్టం ప్రకారం న్యాయపరమైన సమస్యలు రావడంతో 1979లో ధర్మేంద్ర ముస్లింగా మారి హేమమాలినిని పెళ్లి చేసుకున్నారని.. ఇద్దరూ తమ పేర్లను దిలావర్, ఆయేషా బీగా మార్చుకున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయాన్ని చాలా కాలం వరకూ ధర్మేంద్ర ఖండించలేదు. 2004లో ఎలక్షన్లలో పోటీ చేస్తున్నప్పుడు స్పందించి, 'మతం మార్చుకునే అవసరం నాకు లేదు' అని స్పష్టం చేశారు.



బాలీవుడ్ హీ మ్యాన్



ఆ తరం అమ్మాయిలకు ఆయన కలల రాకుమారుడు. 'హీ మ్యాన్' అని నాటి యువతరం ప్రశంసలు అందుకొన్న ధర్మేంద్ర పూర్తి పేరు ధర్మేంద్ర కేవల్ కిషన్ డియోల్. నటుడు, నిర్మాత మాత్రమే కాకుండా రాజకీయ వేత్తగానూ పలువురి ప్రశంసలు అందుకొన్నారు. ఆరున్నర పదుల తన నటజీవితంలో 300కు పైగా చిత్రాల్లో నటించి అందగాడుగా, కమర్షియల్‌గా సక్సెస్ అయిన హీరోగా గుర్తింపు పొందారు. చిత్ర పరిశ్రమలో తనకు గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేకపోయినా నట వారసులే కాదు బయటి నుంచి వచ్చిన వారు కూడా హీరోలుగా రాణించగలరు అని నిరూపించారు ధర్మేంద్ర. తాను హీరోగా పరిశ్రమలో మంచి పొజిషన్ సంపాదించుకోవడమే కాకుండా తన కుటుంబం నుంచి మరికొందరు పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచారు ధర్మేంద్ర. తన కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ కూడా సినిమాల్లో తండ్రి వారసత్వం కొనసాగిస్తున్నారు.

19 ఏళ్లకే పెళ్లి

ధర్మేంద్ర 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని లూథియానా జిల్లా నస్రాలీ గ్రామంలో జన్మించారు. 1952లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 19 ఏళ్లకు ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు. కెరీర్ ఆరంభంలో చిన్న పాత్రల్లో నటించారు ధర్మేంద్ర. ఆయన నటించిన తొలి చిత్రం 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' 1960లో విడుదల అయింది. 'ఆయే మిలన్ కీ బేలా', 'ఫూల్ ఔర్ పత్తర్', 'ఆయే దిన్ బహర్ కే' వంటి చిత్రాలతో 60ల దశకంలోనే ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. 1960-80 మధ్య కాలంలో హీరోగా ఓ వెలుగు వెలిగారు. 'ఆంఖేన్', 'షికార్', 'సావన్ రూమ్ కీ, 'బందినీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'జీవన్ మృత్యు', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'రాజా జానీ', 'జుగ్ను', 'యాదోంకి బారాత్', 'దోస్త్', 'షోలే', 'చరస్', 'ధర్మ వీర్' వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. 1973 ఆయన కెరీర్‌లోనే లక్కీ ఇయర్. ఆయన నటించిన ఎనిమిది చిత్రాలు బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. 1987లో వరుసగా ఏడు సూపర్ హిట్స్ అందుకున్నారు ఆయన. ఇవి కాకుండా ఒకే ఏడాది తొమ్మిది హిట్ చిత్రాలు.. ఇలా రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతూ సాటి హీరోలకు అందనంత దూరంగా ఉండేవారు ధర్మేంద్ర. ఇప్పటికీ ఆ రికార్డ్ ధర్మేంద్రకే సొంతం. ఆ రోజుల్లో మూడు, నాలుగు షిఫ్టుల్లో పని చేస్తూ బిజీగా ఉండేవారు.

తొలినాళ్లలో సాఫ్ట్, రొమాంటిక్ చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఆయన.. 1970 నుంచి యాక్షన్ మ్యాన్ అనే ఇమేజ్‌ను సొంతం చేసుకుని షోలే చిత్రంతో స్టార్ స్టేటస్ సంపాదించారు. బలమైన దేహదారుఢ్యంతో ఉండే ఆయన తెరపైన శక్తిమంతమైన యాక్షన్ రోల్స్‌తో అలరించేవారు. పోరాటాలు కూడా డూప్ లేకుండా చేసేవారు. అందుకే ఆయనను 'హీ మ్యాన్', 'యాక్షన్ కింగ్' అని పిలిచేవారు.

బయోపిక్ ఇష్టం లేదు

ధర్మేంద్ర బయోపిక్‌ను తెరకెక్కించడానికి ఆయనను చాలా మంది దర్శకనిర్మాతలు సంప్రదించినా సున్నితంగా తిరస్కరించేవారు. 'నా బయోపిక్ తెరకెక్కిస్తే, అందులో నాలా నటించే నటులు ఎవరూ కనిపించలేదు' అని ఆయన భావించడమే దానికికారణం.

అమితాబ్‌కు మాట సాయం



తొలినాళ్లలో ధర్మేంద్రతో అమితాబ్ 'షోలే' చేస్తున్న సమయమది. ఈ చిత్రం షూటింగ్ కోసం ధర్మేంద్రతో పాటు అమితాబ్ కూడా బెంగుళూరులో ఉండాల్సిన పరిస్థితి. అయితే అమితాబ్ బెంగుళూరులో ఉండడంతో బొంబాయిలో చాలా సినిమాల చిత్రీకరణలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని దర్శకుడు రమేశ్ సిప్పీకు చెబితే, 'ధర్మేంద్ర కేవలం మీ కోసం రెండు మూడు సినిమాలు రద్దు చేసుకుని వచ్చారు. ఆయన ఏమైనా అనుకుంటాడేమో.. వెళ్లి అడుగు' అని రమేశ్ సిప్పీ అన్నారు. కానీ అప్పటికే సూపర్‌స్టార్ హోదాలో ఉన్న ఆయనకు ఈ విషయాన్ని చెప్పాలంటేనే సందేహిస్తున్నారు. నిర్మాతల బలవంతం మీద అమితాబ్.. 'మీరు వెళ్లమంటే బొంబాయి వెళ్లి మా నిర్మాతల పని పూర్తి చేస్తాను' అని ధర్మేంద్రను అడిగారు. ఆయన 'దానికేముంది.. ఇక్కడ పనిలేకపోతే వెళ్లండి.. నాకేం అభ్యంతరం లేదు' అని బదులిచ్చారు.